ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబర్ 2025

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆ శాఖ ఇఇ త్రినాథరావు ఒక ప్రకటనలో కోరారు. గరివిడిలో ట్రాన్స్‌కో 220/132/33కెవి విద్యుత్ ఉప కేంద్రంలో సుమారు రూ.15 కోట్ల వ్యయంతో 100 మెగా వాట్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 మెగావాట్ల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ పని పూర్తయితే జిల్లాలో నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడంతోపాటు పెరుగుతున్న డిమాండ్‌కి సరిపడా స్థాపక సామర్థ్యం పెంచినట్లు అవుతుందని చెప్పారు. అందులో భాగంగా సబ్‌స్టేషన్‌లో ఈ నెల ఒకటో తేది నుంచి జనవరి 20వ తేది వరకు ప్రస్తుతం ఉన్న ఒక 100 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ షట్‌డౌన్‌లో ఉంటుందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ఈ విషయాన్ని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గురజాడ రచనలు ఆదర్శనీయం

దేశభక్తి గీతాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి ● 'గురజాడ రచనలు.. ప్రాసంగికత'లో వక్తలు పిలుపు



'గురజాడ యుగస్వరం ఎందుకని' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

మహాకవి గురజాడ రచనలు, ఆశయాలు ఎప్పటికీ సమాజానికి ఆదర్శనీయమని వక్తలు తెలిపారు. ఆదివారం గురజాడ వెంకట అప్పారావు 110వ వర్థంతి సందర్భంగా సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ రచనలు-ప్రాసంగికత పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా జెడ్‌పి సమావేశ మందిరంలో గురజాడ సాహితీగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించి, సదస్సులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 'గురజాడ యుగస్వరం ఎందుకని' పుస్తకాన్ని కవులు, సాహితీవేత్తలు ఆవిష్కరించారు.

గురజాడ అప్పారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న తెలకపల్లి రవి, కెఎస్ లక్ష్మణరావు, పి.ఎ.దేవి, సాహితీవేత్తలు, తదితరులు

గొప్ప దార్శనికుడు గురజాడ

తెలకపల్లి రవి

గురజాడ గొప్ప దార్శనికుడని ప్రముఖ కవి, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి కొనియాడారు. 'గురజాడ ప్రవచించిన దేశభక్తి' అనే అంశంపై సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంతో ముందు చూపుతో గురజాడ కవితలను, నాటకాలను రచించారన్నారు. మనిషి ఆధారంగా అభివృద్ధి జరగాలని, సమానత్వం ఉండాలని, కుల, మత భావాలు, తారతమ్యాలు ఉండకూడదని చాటి చెప్పిన మహావ్యక్తి గురజాడ అన్నారు. కానీ, నేడు మతం ఆధారంగా రాజకీయ పార్టీలు ఏర్పడి పాలిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఏ తారతమ్యాలు ఉండకూడదని గురజాడ చెప్పారో.. నేడు కుల, మత, లింగ వివక్షత చూపిస్తూ రాజకీయాలు చేస్తున్నారన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ మనుషులోయ్ అన్న మాటకు తిలోదకాలిచ్చి మొత్తం భూమిని లాగేసుకుంటున్నారని చెప్పారు. గురజాడ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, ఆయన దేశభక్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ గురజాడ ప్రజల కోసం ప్రజా ఉద్యమమని చెప్పారని, ప్రస్తుతం అదే మాట అంటే జైల్లో ఉండేవారన్నారు అధికారం కోసం మతాన్ని వాడుకుంటున్న దుస్థితి నెలకొందన్నారు. ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చేస్తుంటే మనలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. గురజాడ చెప్పిన విధానంగా జ్ఞానం ఒక్కటే నిలిచిపోయే వరకు పోరాడదామని పిలుపునిచ్చారు.

అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు

చారిత్రక సంపదను కాపాడుకుందాం

ఈమని రాణీశర్మ కెఎస్ చలం

చారిత్రక సంపదను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ఇంటాక్ మాజీ కన్వీనర్ ఈమని రాణీశర్మ స్పష్టంచేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి జి.మురళీధర్ అధ్యక్షతన 'ప్రముఖులు స్మారక భవనాలు, చిహ్నాలు పరిరక్షణ- ఆవశ్యకత' అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో రాణీశర్మ ప్రసంగించారు. చారిత్రక ప్రదేశాలను కాపాడుకోవడానికి రాష్ట్రంలో ఉన్న ఏ రాజకీయ పార్టీలూ ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. గురజాడ నివాసానికి ప్రభుత్వాలు ఏవో చేస్తాయని చూస్తూ ఉంటే సమయం వృథా అవుతుందన్నారు. తొట్లకొండ, ఎర్రమట్టిదిబ్బలు గురించి న్యాయ పోరాటం చేయాల్సిన స్థితిలో ఉన్నామన్నారు. గురజాడ నివాసాన్ని, జ్ఞాపకాలను మనమే కాపాడుకోవాలని కోరారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కె.ఎస్ చలం మాట్లాడుతూ కళింగాంధ్ర దేశానికి వెన్నెముకని అభిప్రాయపడ్డారు. అలాంటి నేలపై జన్మించిన గురజాడ సమాజంలోని వైరుధ్యాలను వందేళ్ల క్రితమే వెలుగులోకి తెచ్చారన్నారు. మన ప్రాంతాల పట్ల అణచివేత నాడు నేడు కొనసాగుతుందన్నారు. గురజాడను గుండెల్లోంచి తీసేసి ప్రజల్లో పెట్టాలని కోరారు.

గురజాడ గౌరవ యాత్ర

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా నగరంలో సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ గౌరవయాత్రను చేపట్టారు. తొలుత గురజాడ అప్పారావు జంక్షన్‌లో గురజాడ విగ్రహానికి సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, ప్రముఖ సామాజికవేత్త పి.ఎ.దేవి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ లక్ష్మణరావు, లోకసత్తా రాష్ట్ర అధ్యక్షులు బీసెట్టి బాబ్జీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి జెడ్‌పి సమావేశ మందిరం వరకు గురజాడ గౌరవ యాత్ర చేపట్టారు. ఈ ర్యాలీని పి.ఎ.దేవి జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచానికి తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహా కవి గురజాడ అప్పారావు నివాసాన్ని స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలని సాహితీవేత్తలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలజ్ఞానం కలిగిన వ్యక్తి గురజాడ

కాలజ్ఞానం కలిగిన వ్యక్తి గురజాడ అని ప్రముఖ సామాజిక వేత్త పి.ఎ.దేవి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు రమాగీతాదేవి అధ్యక్షతన 'గురజాడ స్త్రీ పాత్రల ఔన్నత్యం'పై నిర్వహించిన సదస్సులో పి.ఎ.దేవి ప్రసంగించారు. కన్యాశుల్కం నాటకంలో పాత్రలేవీ కల్పితాలు కాదని, భవిష్యత్తుపై ముందుచూపుతో ఆ నాటకాన్ని గురజాడ రచించారని తెలిపారు. సంఘసంస్కరణకు చేయాల్సిన పనులన్నీ ఆ నాటకంలో పాత్రల ద్వారా చూపించారని తెలిపారు. సమాచార హక్కు కమిషనర్ రెహానా మాట్లాడుతూ గురజాడ 125 ఏళ్ల క్రితమే ఆస్తి ప్రస్తావనను స్త్రీలకు అన్వయించారన్నారు.

స్మార్ట్ కేంద్రంగా గురజాడ నివాసం

గురజాడ నివాసాన్ని స్మార్ట్ కేంద్రంగా తీర్చిదిద్దాలని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన 'కన్యాశుల్కం సామాజిక ప్రయోజనం' అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ సభా స్ఫూర్తితో ప్రజలను కూడగట్టి గురజాడ రచనలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో వేల కోట్లు ఖర్చు పెడుతోందని, ఈ సమాజం కోసం, దేశం కోసం కష్టపడిన వారిని గుర్తించడం లేదని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ గురజాడ భవనానికి స్థలం కేటాయించి స్మృతివనంగా నిర్మించాలన్నారు. విజయనగరం జిల్లాను గురజాడ జిల్లాగా లేకుంటే, గురజాడ విజయనగరం జిల్లాగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

గురజాడ రచనలు నిత్య నూతనం

హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్

గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ రచనలు నిత్య నూతనమని హైకోర్టు న్యాయమూర్తి సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. గురజాడ వెంకట అప్పారావు 110వ వర్థంతి సభను గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన పివిజి రాజు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు 25వ గురజాడ విశిష్ట పురస్కారాన్ని ఆయన ప్రదానం చేశారు. అనంతరం ఇనాక్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న సాంఘిక దురాచారాలను, కట్టుబాట్లను, సమాజంలోని కుళ్లు బయటకు తీయడానికి గురజాడ రచనలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. విశ్వ మానవాళిని ప్రేమించమని ఆనాడే చెప్పిన వ్యక్తి గురజాడ అని కొనియాడారు. ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ 120 ఏళ్ల క్రితమే సమాజ మార్పుకు ఒక సూచికగా కన్యాశుల్కాన్ని రచించారన్నారు. తన సాహిత్యం ద్వారా సమాజ మార్పుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, పురస్కార ప్రదాత కోలగట్ల తమన్న శెట్టి, నవ సాహితీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్‌వి సూర్యప్రకాశరావు, సన్స్ స్కూల్ అధినేత ఎం.అనిల్‌కుమార్, గురజాడ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గంజాయిని అరికట్టాలి

- పెంచలయ్యను హత్యచేసిన వారిని అరెస్టు చేయాలి
- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డ్రగ్స్, గంజాయిని అరికట్టాలని, పెంచలయ్య హత్యకు పాల్పడిన గంజాయి మాఫియాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద కొవ్వొత్తులతో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్.హరీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి రాము మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో డివైఎఫ్ఐ నాయకుడు పెంచలయ్యను హతమార్చిన గంజాయి ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ముఠా అరాచకాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని అరికట్టడంలో పాలకులు పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. నిందితులను పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై దాడులకు తెగబడే స్థాయికి గంజాయి బ్యాచ్ వెళ్లిందంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. డ్రగ్స్, గంజాయిపైన ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ పోరాటం కొనసాగుతుందని, దాడులకు భయపడేది లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, సోమేష్, వంశీ, జయ, సిరి, జగదీష్, డివైఎఫ్ఐ నాయకులు మురళి, గోపి పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు బి.శంకరరావు, ఎం.అప్పలరాజు కోరారు. ఈ నెల 6,7తేదీల్లో కడపలో జరిగే సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆదివారం కోట జంక్షన్‌లో ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడుకోవడం కోసం, వామపక్ష ఐక్య ఉద్యమాల కోసం మహాసభలో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గిరి ప్రసాద్, సత్యారావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరంలో చలి తీవ్రత దృష్ట్యా మేమున్నాం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు కె.ఎస్.ఎన్ మూర్తి మాట్లాడుతూ 50 మంది నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి టి.వి.రమణ కోరారు. ఆదివారం జెడ్‌పి కార్యాలయ ప్రాంగణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఎయు మైదానంలో సిఐటియు జాతీయ మహాసభ జరుగుతుందని చెప్పారు. ముగింపు రోజు ఆర్‌కె బీచ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికవర్గ ఐక్యతకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, దేశ సమైక్యతకు కట్టుబడి దేశవ్యాప్తంగా సిఐటియు పోరాటాలు నిర్వహించిందన్నారు. కోటి మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే సిఐటియు మహాసభ విశాఖ కేంద్రంగా తొలిసారిగా జరుగుతుందని తెలిపారు. కార్మిక వర్గం, ఉద్యోగులు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు, నాయకులు వి.మహాలక్ష్మి, సునీత, రాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద 12న అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఎపి అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పైడిరాజు, అనసూయ తెలిపారు. ఆదివారం కెఎల్‌పురంలోని సిఐటియు కార్యాలయంలో ధర్నా కరపత్రాన్ని వారు విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజులపాటు అంగన్వాడీలు చేసిన సమ్మెకు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు మద్దతు ఇచ్చారని, తాము అధికారంలో కొస్తే అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా హామీలు నెరవేర్చకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పోరాడుతుంటే నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న చేపట్టే ధర్నాకు అంగన్వాడీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, కోశాధికారి ఎం.కృష్ణమ్మ, ఎం.సుభాషిని, మాలతి, కుమారి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

డిఆర్‌ఒకు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్, డిఇఒ, తదితరులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి ఆదర్శనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఆయన సన్మాన కార్యక్రమాన్ని జిల్లా అధికారుల అసోసియేషన్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీనివాసమూర్తికి అనుభవంతోపాటు గొప్ప నాయకత్వ లక్షణాలు ఉన్నాయన్నారు. కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసమూర్తి అంకితభావానికి మారుపేరని కొనియాడారు. సీనియర్ ఐఎఎస్ అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సుమారు 34 ఏళ్లపాటు సేవలు అందించి మచ్చలేని వ్యక్తిగా పేరు గడించారని, అత్యంత క్లిష్టమైన రెవెన్యూ శాఖలో ఇది అరుదని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ మాట్లాడుతూ, విధి నిర్వహణ పట్ల ఆయన చూపిన అంకితభావం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, విశ్వేశ్వరయ్య, జల్లేపల్లి వెంకటరావు, డాక్టర్ ధర్మచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, పి.బాలాజీ, వి.టి రామారావు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు తాడ్డి గోవింద, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

డిపిఆర్‌టియు జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిపిఆర్‌టియు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక డిపిఆర్‌టియు కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.పైడిపునాయుడు, రెడ్డి భాస్కరరావు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా పువ్వల శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇనుముల నారాయణపప్పడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎండి షరీఫ్, కోశాధికారిగా కె.పైడిపునాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా చలుమూరి వెంకటరావు, అల్లం పురుషోత్తం, కార్యదర్శులుగా పి.సతీష్, ఎన్.సత్యం, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బి.వి.లక్ష్మి ఎన్నికయ్యారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.లోకనాథం ఎన్నికల అధికారిగా, రాష్ట్ర సలహాదారు కంది వెంకటరమణ ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

ఎయిడ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

75 కేంద్రాల ద్వారా హెచ్ఐవి పరీక్షలు ● 'ప్రజాశక్తి'తో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కె.రాణి ముఖాముఖి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కె.రాణి తెలిపారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల అధిక శాతం కేసులు నమోదు అవుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాల ద్వారా హెచ్ఐవి పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. విజయనగరంలో ఉన్న ఎఆర్‌టి కేంద్రంతో పాటు లింకు ఎఆర్‌టి కేంద్రాల ద్వారా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి ఏటా డిసెంబర్ ఒకటో ప్రపంచ ఎయిడ్స్ డేను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నెలాఖరికి 49,607 పరీక్షలు చేయగా 178 పాజిటివ్ కేసులు వచ్చాయని తెలిపారు. 20,018 మంది గర్భిణులకు టెస్టులు చేయగా, నాలుగు పాజిటివ్‌గా నమోదైనట్లు చెప్పారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి పిహెచ్‌సి, సిహెచ్‌సి పరిధిలో హెచ్ఐవి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాజిటివ్ వచ్చిన ప్రతి ఒక్కరికీ సిడి 4 పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందిస్తున్నాం. ప్రతి ఏటా డిసెంబర్ ఒకటో తేదిన ప్రపంచ ఎయిడ్స్ డే ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఎయిడ్స్ రోగులకు మందులు అందించే ఎఆర్‌టి కేంద్రాలు ఎన్ని ఉన్నాయి.?

జిల్లాలో హెచ్ఐవి రోగులకు విజయనగరం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎఆర్‌టి కేంద్రంలో మందులు అందిస్తున్నాం. లింక్ ఎఆర్‌టి కేంద్రాలు మిమ్స్, బొబ్బిలి, బాడంగి, గజపతినగరం, భోగాపురం, చీపురుపల్లి, రాజాం, ఎస్.కోటలో ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా కూడా మందులను అందిస్తున్నాం.

జిల్లాలో హెచ్ఐవి స్క్రీనింగ్ టెస్టింగ్ కేంద్రాలు ఉన్నాయి.?

జిల్లాలో ప్రభుత్వ విభాగంలో 75 కేంద్రాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఐసిటిసిలు కేంద్రాలు 11, ఎఫ్ఐసిటిసి 64, టిఐఎన్‌జిఒ 3 కేంద్రాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నాం.

గత నాలుగేళ్లలో ఎంతమందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించారు.? ఎన్ని పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.?

జిల్లాలో 2022-23 సంవత్సరంలో 77,146 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించగా 466 పాజిటివ్ కేసులు తేలాయి. 2023-24లో 71,758 పరీక్షలు చేస్తే 389 పాజిటివ్ కేసులు వచ్చాయి. 2024-25లో 76,194 మందికి పరీక్షలు చేయగా, 372 మందికి పాజిటివ్‌గా నిర్ధారణైంది. 2025-26లో అక్టోబర్ నెలాఖరు నాటికి 49607 మందికి పరిశీలించగా 178 మందికి పాజిటివ్‌గా నమోదయ్యాయి. గర్భిణిల్లో 2022-23లో 46,362 మందికి పరీక్షలు నిర్వహించగా 13 పాజిటివ్ కేసులు వచ్చాయి. 2023-24లో 40,432 మందికి పరీక్షలు నిర్వహించగా 6 కేసులు, 2024-25లో 34,764 మందిని పరీక్షించగా 14 పాజిటివ్ కేసులు, 2025-26 అక్టోబర్ నాటికి 20,218 మందికి పరీక్షలు నిర్వహించిగా 4 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

కార్యకర్తలతో మాట్లాడుతున్న రాజారావు

కార్యకర్తలు కష్టపడి పని చేయండి

ప్రజాశక్తి - గుర్ల

ప్రతీ కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పని చేయాలని టిడిపి పరిశీలకులు గేదెల రాజారావు అన్నారు. ఆదివారం మండలంలోని తెట్టంగి, పల్లిగండ్రేడు గ్రామాల్లో ఆదివారం పోలింగ్ బూత్‌లను పరిశీలించి, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు జమ్ము సన్యాసి నాయుడు, గ్రామ టిడిపి అధ్యక్షులు గేదెల లక్ష్మణనాయుడు, పిఏసిఎస్ డైరెక్టర్ గేదెల సూరినాయుడు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పొండంకి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ నాయకులు జమ్ము సన్యాసినాయుడు, గేదెల సన్యాసినాయుడు, వెన్నె సంతోష్, జమ్ము సత్యం తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు సర్కారు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - రేగిడి

చిన్న పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ సోదరుడు, టిడిపి సీనియర్ నాయకులు కొండ్రు జగదీశ్వరరావు అన్నారు. లచ్చన్నవలస శ్రీవదర్ధ మోడ్రన్ రైస్ మిల్లును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి కల్పన దిశగా సర్కారు ప్రోత్సహిస్తుందన్నారు. నిరుద్యోగులకు చిన్న తరహా పరిశ్రమలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్, లావేటి సత్యంనాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నారు జనార్ధనరావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్య దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లూరు జిల్లా సిపిఎం నాయకులు పెంచలయ్య హత్య దుర్మార్గమని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు ఖండించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లా సిపిఎం నాయకులు, ప్రజాకళాకారుడు కె.పెంచలయ్యను గంజాయి బ్యాచ్ హత్య చేయడం దారుణమన్నారు. పెంచలయ్య పేదల సమస్యలు పరిష్కారానికి పోరాటం చేస్తున్నారని, గంజాయి ముఠా ఆగడాలను అడ్డుకునే క్రమంలో పెంచలయ్యను గంజాయి బ్యాచ్ దారుణంగా హత్యా చేసిందని అన్నారు. పోలీసులు అంటే గంజాయి ముఠాకు భయం లేకుండా పోయిందని రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. పెంచలయ్యను హత్య చేసిన గంజాయి మఠాను పోలీసులు పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

డ్రోన్ సహకారంతో మందుల పిచికారీ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి శ్రీనివాసరావు పొలంలో డ్రోన్ సహకారంతో పెసర, మినప పంటలకు మందును ఆదివారం పిచికారీ చేశారు. మండలంలో తొలిసారిగా డ్రోన్ సహకారంతో ఇలా పిచికారి చేయడంతో రైతులు ఆశక్తిగా పాల్గొని తిలకించారు. మానవ మనుగడకు ముప్పు లేకుండా డ్రోన్ సహకారంతో ఇటువంటివి చల్లితే ప్రమాదాలు ఉండవని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.. వీరితోపాటు రైతులు మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు.

జాతీయ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలలో బైపిసి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ద్వారపూడి సిరివర్షిత రాష్ట్రస్థాయి క్యాంపస్ ఎగ్జామినేషన్ లెవెల్ 111కి అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. 'విజ్ఞాన మంతన్' ఏటా విద్యార్థుల్లో ఉన్న శాస్త్రీయ వైఖరిని, సాంస్కృతిక దృక్పథాన్ని గుర్తించడానికి ప్రతిష్టాత్మకంగా సైన్సు టాలెంట్ చర్చ్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. మొదటగా లెవెల్ వన్‌లో అర్హత సాధించిన వారు లెవెల్ 11 పరీక్ష రాయవలసి ఉంది. లెవెల్11లో కూడా అర్హత సాధించిన వారు రాష్ట్రస్థాయి క్యాంపస్ లెవెల్లో 111కి ఎంపిక అవుతారు. ఎన్నికైన వారికి వారి సంస్థ తరపున అవార్డులు కాలర్ షిప్పు, సర్టిఫికెట్లు అందజేస్తారని ఆయన తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జనసేన బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పిలుపునిచ్చారు. ఆదివారం సారిపల్లి నగరవనంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల జిల్లాస్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం కార్యకర్తల బాధ్యత అని వివరించారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు లోకం ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జనసేన సిద్ధాంతాలను పాటిస్తూ, ప్రజలకు సేవ చేసే దిశగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణిపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి : గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత మహిళా ఉద్యోగిపై మంత్రి పిఎ, కుమారుడు వేధింపులు చేసినట్లు మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రజల డబ్బుతో జీతాలు తీసుకుంటున్న పోలీసులు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాయడం సరికాదన్నారు. తక్షణమే సిఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మంత్రి పదవి నుంచి సంధ్యారాణిను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి- బాడంగి

ప్రమాదవశాత్తు ఇంట్లో పొయ్యి దగ్గర నిప్పంటుకుని మండల కేంద్రానికి చెందిన మరడాన పాపమ్మ (76) మృతి చెందినట్లు ఎస్ఐ తారకేశ్వరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఎప్పటిలాగే వంట చేయాలని ఇంట్లో కర్రలు పొయ్యి వెలిగించిన పాపమ్మ చీరకు నిప్పు అంటుకొని తీవ్రంగా గాయపడింది. వెంటనే బాడంగి సామాజిక ఆస్పత్రిలో వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆమె మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. మృతురాలికి నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి

ప్రజాశక్తి - వంగర

మృతి చెందిన గొర్రెలు

మండలంలోని తలగాంలో వీధి కుక్కల దాడిలో ఆదివారం ఐదు గొర్రెల మృతి చెందగా మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పడాల గంగులు తన గొర్రెలను గ్రామ సమీపంలో ఉన్న షెడ్డులో పెట్టి తన పని కోసం బయటకు వెళ్ళగా వీధి కుక్కలు ఒక్కసారిగా మూకుమ్మడిగా ఐదు గొర్రెలపై దాడి చేసి చంపేసాయి. మరికొన్ని గొర్రెలను గాయపరచడంతో బాధితుడు రోధిస్తున్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పలు గ్రామాలలో వీధి కుక్కలు గొర్రెల పైన మనుషులు పైన దాడి చేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా ఉద్యమంతోనే స్టీల్‌ప్లాంట్‌కు రక్షణ

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - జామి

రాజకీయాలకు అతీతంగా బలమైన ప్రజా ఉద్యమం ఏర్పడినపుడే, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగుతోందని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అన్నారు. జామి చైతన్య వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీతారామ కళ్యాణ మండపంలో ' విశాఖ స్టీల్ ప్లాంట్ - భవిష్యత్తు' అనే అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి, చైతన్య వేదిక కన్వీనర్ ప్రముఖ న్యాయవాది బివి రమణారావు అధ్యక్షత వహించగా, కాంగ్రెస్ పార్టీ ఎస్.కోట ఇంచార్జ్ గేదెల తిరుపతిరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె రవికుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జనసేన నాయకులు వర్మరాజు, బిజెపి మండల అధ్యక్షులు ఆదిలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఈశ్వరావు, వైసిపి ఆర్‌టిఐ వింగ్ జిల్లా అధ్యక్షులు ఎ. సుబ్రమణ్యం, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ కంది వెంకటరమణ, టిడిపి మండల అధ్యక్షులు వర్రి రమణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని మాట్లాడుతూ 1966లో లక్షమందికి పైగా ప్రజానీకం పోరాటం చేయగా, 32 మంది బలిధానంతో ఆంధ్రుల హక్కు - విశాఖ ఉక్కు అన్న నినాదంతో స్టీల్ ప్లాంట్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

సాధించుకున్నామని గుర్తు చేశారు. నేడు ప్రపంచంలోనే ప్రముఖ పరిశ్రమల్లో ఒకటైన స్టీల్ ప్లాంటకు కావాలనే కృత్రిమ కొరతలు సృష్టించి, నేడు రూ.5 లక్షల విలువ చేసే ప్లాంట్‌ను, కారుచవకగా రూ.5వేల కోట్లకు అమ్మేయ్యాలని చూడడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు గుర్లలో స్టీల్ ప్లాంట్ పేరిట వందల ఎకరాలు భూసేకరణకు సిద్ధమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం దేశ భక్తిని వల్లించే బిజెపి, దేశానికి తలమాణికంగా ఉన్న స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయడానికి సిద్ధమవుతుందని అన్నారు. కార్పొరేట్లకు లక్షలు కోట్ల రాయతీలు ఇస్తున్న, కేంద్ర ప్రభుత్వం, లక్షలాది ప్రజానీకం మేలుచేసే స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేస్తామనడం దుర్మార్గమన్నారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె రవికుమార్ మాట్లాడుతూ దేశంలోనే ఏకైక ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంటుగా ఉన్న విశాఖ ఉక్కును రాష్ట్ర ముఖ్య మంత్రి వైట్ ఎలిఫెంట్‌గా పోల్చడం శోచనీయం అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని గుర్తు చేశారు. రాజకీయాల కోసం ఎన్నికల్లో స్టీల్ ప్లాంట్ ను కాపాడుతామని చెప్పి, అధికారం వచ్చాక మిటల్ కంపినీకి గనులు ఇవ్వాలని టిడిపి ఎంపీలు రికమేండ్ చేయడం నమ్మకద్రోహం తప్ప మరొకటి కాదన్నారు. రాజకీయాలతో పాటు బలమైన ప్రజా ఉద్యమంతో ప్రయివేటీ కరణను అడ్డుకోగలమని సూచించారు. కాంగ్రెస్ ఎస్. కోట ఇన్‌చార్జ్ డాక్టర్ గేదెల తిరుపతి మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ప్రజల ఆస్థి అని, దాన్ని కారుచవకగా అమ్మేయడం సరికాదని, అందరూ ఒకటై ప్రయివేటీకరనను అడ్డుకోవాలని అన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గుర్ల

ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసి నాయుడు అన్నారు. ఆదివారం గరివిడి మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్నిఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులైన మహిళలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ శిక్షణలో చేరాలనుకున్నవారు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగివుండలన్నారు. కనీసం 8వ తరగతి చదివి ఉండాలన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 4పాస్ పోర్ట్ సైజ్ ఫొటోస్‌తో కార్యాలయానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చనమల మహేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిరుములరాజు కిరణ్ కుమార్, సంచాన సన్యాసి నాయుడు, చింతపల్లి పేట సర్పంచ్ జమ్ము అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పంచాయతీలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలో ఉన్న గిరిజన గ్రామాలన్ని కలిపి గిరిజన పంచాయతీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకర్రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మోసురువలస, ఎరకందొరవలస, డొంగురు వలస, చిలకమ్మవలస తదితర గిరిజన గ్రామాల్లో ఆదివారం పర్యటించి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు ప్రత్యేకమైన పంచాయతీ లేనందున వాళ్ళు అవసరాలకు అనుగుణంగా పంచాయతీ తీర్మాణాలు జరగడంలేదని, వాళ్లకు సంబంధించిన ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా అందక పోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో దాదాపు 16 గిరిజన గ్రామాలు ఉన్నాయని కొన్ని గ్రామాలు సిహెచ్ బొడ్డవలస పంచాయతీలో, కొన్ని గ్రామాలు కాసిందొరవలస పంచాయతీలో, కొన్ని గ్రామాలు జీవిఎస్ఆర్‌పురం పంచాయతీలో ఉన్నాయని వీటన్నింటిని విడదీసి రెండు గిరిజన పంచాయతీలుగా విభజించాలని అన్నారు. ఆయా పంచాయతీల

గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శంకరరావు

నుంచి ఈ గిరిజన గ్రామాలను విడదీసినప్పటికి ఆయా పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన వచ్చే నష్టం లేదన్నారు. పంచాయతీల పునర్నిర్మాణానికి ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఉన్న నిషేధాన్ని ఎత్తివేసినందున జనాభా ప్రాతిపదికన గిరిజన గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్నారు. ఆయనతోపాటు సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, కె.కొలన్నదొర, పి.పొలన్నదొర గిరిజనులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ముసిడిపల్లి పంచాయతీ చినఖండేపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడానికి ఆధునిక పద్ధతుల ద్వారా ప్రకృతి సేద్యాన్ని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అనంతరం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొని స్వయంగా అన్నదాతలతో కలిసి మాట్లాడారు. వ్యవసాయ అధికారులతో కలిసి రైతన్నా-మీ కోసం కరపత్రాలను పంపిణీ చేశారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే అంశాలతో పంచ సూత్రాలతో అన్నదాతలకు అండగా నిలవడానికి రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు అచ్చెంనాయుడు, పిఎసిఎస్ చైర్మన్‌లు మేడపురెడ్డి శ్రీను, జిఎస్ నాయుడు, డైరెక్టర్ ఇందుకూరి శ్రీనివాసరాజ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎఒ రవీంద్ర, సీఎస్ డిటి జయలక్ష్మి, గంగరాజు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి డెల్టా పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఈ నెల 21న ఉదయం 10వ తరగతి విద్యార్థులకు 15వ రాష్ట్ర స్థాయి ఆంగ్ల భాషా ప్రతిభా పాటవ పరీక్షను స్థానిక ఎస్-ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం (డెల్టా) అధ్యక్షుడు మింది విజయ మోహన్ రావు ఆదివారం ఉదయం డెల్టా కార్యాలయంలో పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యుల సమావేశంలో తెలిపారు. ప్రైవేటు మినహా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుండి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆఫ్ లైన్, ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఎంపిక చేసిన దాదాపు 300 మంది మెరిట్ విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన తొలి మూడు స్థానాల విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, 2వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తామని అన్నారు. డిసెంబర్ 15 లోగా ఆంగ్ల భాష ఉపాధ్యాయులు తమ విద్యార్థుల వివరాలను 9440744741 నంబరులో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెల్టా పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు బి.పరమేశ్వర రావు, పి. సత్యన్నారాయణ, బి. రామకృష్ణ, బి. గణేష్, ఎస్. శ్రీనివాస్ రావు, బి.రాకేష్, సి. హెచ్.రాంబాబు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డెల్టా అధ్యక్షుడు విజయ్‌మోహన్‌రావు

గురజాడ తెలుగు సాహిత్యానికి వెలుగు జాడ

ప్రజాశక్తి- బొబ్బిలి

మహాకవి గురజాడ తెలుగు భాషకు, వ్యవహారిక భాషా సాహిత్యానికి వెలుగు బాట వేసిన మహనీయుడని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో కారుణ్య ఫౌండేషన్, శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో లైబ్రేరియన్ స్వర్ణ కుమారి గురజాడ అప్పారావు 110వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కారుణ్య సంస్థ చైర్మన్ జెసి రాజు గురజాడ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య ప్రతినిధులు రమేష్, రామకృష్ణ, చిన్నారావు, జిసిహెచ్‌జి శర్మ, అర్ఎన్ రాజు, సోమేశ్వర రావు పాఠకులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: గురజాడ అప్పారావు వర్ధంతి పురస్కరించుకొని బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణ మూర్తి ఆధ్వర్యంలో గున్న తోటవలస గ్రామ శివారున అపార్ట్మెంట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహి ంచారు. ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు మహేష్, వివన్ శర్మ, కృష్ణదాస్, రాజు పాల్గొన్నారు.

గుర్ల: గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వర్ధంతి సభ ఆదివారం గుర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బెల్లాన బంగారు నాయుడు పాల్గొని గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గోషాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చందక అప్పలనాయుడు, గుర్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీనివాస రావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజు తదితరులు

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - రామభద్రపురం

నియోజకవర్గం పరిధిలో రహదారుల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆదివారం నాయుడువలసలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామమంతా కలియ తిరిగి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. తాగునీరు, వీధుల్లో సిసి రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తుందని అర్హులైన వారికి అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ధాన్యం ప్రభుత్వ విక్రయ కేంద్రాల్లోనే అమ్మి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతిరావు, గ్రామ నాయకులు అప్పన్న, రామినాయుడు, వెంకటి, కృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సొంత నిధులతో వాటర్ ట్యాంకు నిర్మాణం

తెర్లాం: మండలంలోని జగన్నాధవలస బీసీ కాలనీలో ప్రజలు మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యే బేబీ నాయన దృష్టికి రావడంతో, వెంటనే తన సొంత నిధులతో మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేసి, తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బేబీనాయన చేతుల మీదుగా మంచినీటి ట్యాంకును ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ నర్సుపల్లి వెంకట్‌నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు సాగిరాజు శ్రీనివాసరాజు గ్రామ, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

స్తంభమెక్కిన నిర్లక్ష్యం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడ మెట్ట సమీపంలోని 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద త్రీ ఫేస్ స్తంభాల విద్యుత్ తీగలపై పిచ్చి మొక్కలు ఎక్కిడంతో స్థానికులు నివ్వెర పోతున్నారు. గత ఐదు నెలలుగా ఈ స్తంభాలపై పిచ్చి మొక్కలు ప్రాకి త్రీఫేస్ తీగలపై అల్లుకోవటంతో ఎప్పటికప్పుడు విద్యుత్తు నిలిచిపోవడం పట్ల వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ పక్కనే ఇలా జరిగినా పట్టించుకోకపోవడంతో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తుందని వినియోగదారులు చర్చించుకుంటున్నారు. పిచ్చి మొక్కలు స్తంభాలకు, విద్యుత్ తీగలకు అల్లుకుపోవడం వల్ల చిన్న చిన్న గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం పట్ల ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలపై, విద్యుత్ తీగలపై ఉన్న పిచ్చి మొక్కల తీగలను తొలగించి సక్రమంగా విద్యుత్తు సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఉంగరాడమెట్ట వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభం

ప్రమాదకరంగా ఉన స్తంభం

యువజన అధ్యక్షుడిగా గురునాథరెడ్డి

ప్రజాశక్తి - భోగాపురం

వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా రెడ్డిక కంచేరు గ్రామానికి చెందిన శీరపు గురునాథరెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పార్టీ అధ్యక్షులు వైస్ జగన్ మోహన్ రెడ్డి తనపై నమ్మకం ఉంచి తనకు అవకాశం ఇచ్చినందుకు ఆయన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తానని, యువజన విభాగం అభివృద్ధికి తన వంతు కృష చేస్తానని గురునాథ రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డికి, ముఖ్య నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌టిలకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో కొండగూళ్ళు వద్ద కోళ్ల ఫారంలో వీలుపరితి పంచాయతీ పరిధిలో గల బొర్రావలస గిరిజన కుటుంబానికి చెందిన వై.గౌరీ, ఉమామహేశ్వర్ దంపతులు పనిచేస్తున్నారు. వీరికి ఇద్దర పిల్లలు కాగా ప్రస్తుతం ఆమె మళ్లీ గర్భవతి. వీరికి సకాలంలో డబ్బులు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్న విషయాన్ని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బీహెచ్ లక్ష్మి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎల్లాజీ రావు, చైల్డ్ లైన్ ప్రతినిధి సిహెచ్ అరుణ్ కుమార్, నేచర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బంగారు బాబు, స్థానిక లేబర్ ఆఫీసర్ జోషిలా, తహశీల్దార్ జె.రాములమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణశ్రీ, ఎస్ఐ నాగేశ్వ రరావు, మహిళా కానిస్టేబుల్ సన్యాసమ్మ, తదితరులు రెవెన్యూ కార్యాలయం వద్దకు బాధితులను తీసుకువచ్చి ఆదివారం వారి వాంగ్మూలాన్ని రాసుకున్నారు. అనంతరం కోళ్ల ఫారం యజమాని నుంచి రావలసిన బకాయిలను వసూలు చేసి బాధిత కుటుంబానికి అందజేసే బాధ్యత తీసుకుం టామని అధికారులు భరోసా ఇచ్చారు. ఈ నివేదికను జిల్లా ఆర్‌డిఒ తగు చర్యలు నిమిత్తం పంపిస్తామని తహశీల్దార్ తెలిపారు.

విచారణ చేస్తున్న తహశీల్దార్ రాములమ్మ

రూ.10వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ఉప్పాడపేటకు చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు ఉప్పాడ గౌరీ రెడ్డి కొద్ది రోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జనసేన మండల నాయకులు గురువారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిఖ సాయం అందించారు. ప్రజా సేవలో భాగంగా పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడడం పార్టీ బాధ్యత అని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు వందనాల రమణ, బొల్లు త్రినాథ్, కొండపు రాధాకృష్ణారెడ్డి, మాత నవీన్, దల్లి శ్రీను, కొయ్య రాంబాబు, నోడగల రాము, నోడగల లక్ష్మణ్, కొండపు రమణ, పతివాడ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బహుమతిని అందుకుంటున్న నెల్లిమర్ల జట్టు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ఎంఇఒ ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం జరజా పుపేటకు చెందిన మద్దిల సన్యాసిరావు మాస్టారు ఆధ్వర్యంలో థామస్ పేట పుట్ బాల్ మైదానంలో నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన ఉపాధ్యాయుల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. నెల్లిమర్ల మండల ఉపాధ్యాయుల జట్టుకు పిన్నింటి వాసు కెప్టెన్‌గా వహించగా, గుర్ల మండల జట్టుకు హరి మోహన్ కెప్టెన్‌గా వహించారు. ఈ పోటీలో నెల్లిమర్ల జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. విజేతలకు ఎంఇఒ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో గుర్ల ఎంఇఒ ఎం.శ్రీనివా సరావు, గవర్నమెంట్ ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయులు సిహెచ్.ఆనంద మూర్తి, బాబువిశ్వేశ్వరరావు, హరి శ్రీను, కడలి సత్యసాయి గణేష్ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT: VISAKHAPATNAM
G.W.O.P. 21/2022
(For legal Guardianship of minor Chy. Mopada Bhavishya, D/o. Sriramulu Naidu @ Sri Ramu)
Between:
Smt. Garikina Durga ...Petitioner
And
Mandal Education Officer, Bheemunipatnam Mandal, **Visakhapatnam District** & others ...Respondents

NOTICE

To,
R-2: Mopada Sri Ramulu Naidu @ Sri Ramu, S/o. Ramulu, Hindu, aged 42 years, R/at Venakuveedhi, Srungavarapukota Mandal, Vizianagaram District-535145.

Take notice that the above numbered G.W.O.P.21/2022 which was filed by the petitioner against you for custody of her minor daughter and the same is posted to **17-12-2025.** You are, therefore, required to appear either in person or through a properly instructed Advocate at **10:30 A.M** on **17-12-2025**, in the above captioned Court failing which you will be set ex-parte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
R. PARAMESWARA RAO
PILLA APPA RAO (Raju)
Advocates, Visakhapatnam,
Cell: 99856 13003, 8247473720.

టిడిపిలో 300 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని బడేవలస, జీటిపేట, గుర్ల పంచాయతీల పరిధిలోని దాదాపు 300 కుటుంబాలు టిడిపిలో చేరాయి. గుర్ల గ్రామంలో నిర్వహించిన ఈ చేరిక కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొని పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. యువత భవిష్యత్తు బాగుండేలా, రైతులకు, పేదలకు న్యాయం జరిగేలా చంద్రబాబు నాయకత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ నమ్మకంతోనే ప్రజలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, పిఎసియస్ అధ్యక్షులు గొర్లె ముసలినాయుడు, ఎంపిటిసి ఎర్రినాయుడు, శింగంపల్లి అప్పలనాయుడు, శరకాన రామునాయుడు, గొర్లె సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో మంత్రి సంధ్యారాణి

పట్టాదారు పాసుబుక్ పోయినది

తేదీ 26-11-2025 బుధవారం నా ఆఫీసు నుండి జిరాక్స్ నిమిత్తం వెళ్తుండగా మార్గ మధ్యం లో నా పేరున గల పట్టాదారు పాస్‌బుక్ (ఖాతా నెం. 621) పోయినది. దొరకినవారు దయచేసి క్రింది అడ్రస్ కు అందజేయ కోరుచున్నాను.

గనివాడ శివ సత్యనారాయణ,
ఆనంద ఎన్ క్లేవ్ అపార్టుమెంట్,
కోట జంక్షన్, విజయనగరం,
సెల్ : 8008030033.